# తల్లీ బిడ్డా

రాత్రి కుండపోతగా కురిసిన వర్షం ఉదయం కాస్త తెరిపి ఇచ్చింది.

ఆస్పత్రి ఆవరణలో విషాదం ఒక పొగమంచులా ఆవరించి వుంది. ఒక మూలన తులసమ్మ తలమిణుకుల్లో పెట్టుకు కూర్చొని... బంతిలా చుట్టుకుపోయి మూర్తీభవించిన దుఃఖంలా వుంది.

తల్లి స్థితిని చూసి తల్లడిల్లిపోతున్నది జ్యోతి.

జ్యోతి ఎంత బతిమలాడుతున్నా పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టడంలేదు తల్లి. ఉదయం మధ్యాహ్నం అయింది. ఆమె అలానే వుంది. మధ్యాహ్నం సాయంత్రం అయింది. అయినా ఆమె అలానే వుంది.

తల్లి రోజుకి నాలుగైదుసార్లు తాగుతుంది టీ. ఈ రోజు టీనీళ్ళతో కూడా గొంతు తడుపుకోవడం లేదు.

జ్యోతికి ఏడుపొస్తోంది.

ఐసియులో జగ్గారావు... తులసమ్మ భర్త తలకు బలమైన గాయంతో అపస్మారకస్థితిలో వున్నాడు.

జ్యోతి మెడికల్ స్టూడెంట్ కావడంతో చొరవతో తండ్రి పరిస్థితిని డాక్టర్లను అడిగి తెల్సుకునే ప్రయత్నం చేస్తున్నది. "బతకడం కష్టం. ఆ భగవంతుడే మీ తండ్రిని బతికించాలి" అన్నట్లు మాటాడుతున్నారు.

ఇదిలా వుండగా...అటువైపు తులసమ్మ ఒక్కసారిగా సొమ్మసిల్లిపడి పోయింది. వైద్యులు అటెండయి, రెండు సెలైన్‌బాటిల్స్ ఎక్కించి, ఆమెను ఆస్పత్రిలో వుంచ కుండా ఇంటికి తీసుకుపొమ్మని జ్యోతికి సలహా ఇచ్చేరు. తల్లి రానంటున్నప్పటికీ బలవంతంగా ఇంటికి తీసుకెళ్ళిపోయింది జ్యోతి, ఆస్పత్రిలో తండ్రి వద్ద బంధువు ఒకరిని వుంచి.

***

పోలీసు బృందం ఒక్కసారిగా, హఠాత్తుగా ఇంటి మీదకి దాడిచేయడంతో నిలువెల్లా వణికిపోయింది జ్యోతి. ముచ్చెమటలు పట్టేశాయి. తల్లిని ఎంక్వయిరీలో అడిగిందే పదిసార్లు అటూ ఇటూ తిప్పి తిప్పి అడిగేరు. ఆత్మసంయమనంతో, గుండె నిబ్బరంతో ఏమాత్రం తడుముకోకుండా తల్లి వివరాలు చెప్పడం చూసి తెల్లబోయింది జ్యోతి. పోలీసులు తనని అడిగితే తల్లిలా అంత నిబ్బరంగా చెప్ప గలిగేదా?

వాళ్ళు రికార్డు చేసుకున్నది ఏమిటంటే జగ్గారావు గత రాత్రి పదిగంటల నలభై నిమిషాలకు రెండంతస్తుల మేడపై నుంచి తూలి కిందకు పడిపోయేడు. అప్పుడు మస్తుగా తాగివున్నాడు.

అదే సమయంలో వర్షం కుండపోతగా పడుతోంది. అపస్మారకస్థితిలో, 108 వ్యాన్‌లో ఆస్పత్రికి జగ్గారావుని తీసుకువెళ్ళడాన్ని నోట్ చేసుకున్నారు.

పోలీసులు తులసమ్మతో మాటాడి వూర్కోలేదు. ఆమె ఇంట్లో అద్దెకు వున్నవాళ్ళతో మాటాడేరు. ఇరుగుపొరుగు వాళ్ళతో మాటాడేరు. చివరికి పోలీసు ఎంక్వైరీ... పోలీసుల చేతిలో డబ్బులు పడిన తర్వాతే పూర్తయింది.

పోలీసులు వెళ్ళిపోయేక... తులసమ్మ దేవుడి గదిని ఆశ్రయించింది. ఆమెకు దైవభక్తి అపారం... ప్రతి రోజూ ఉదయం దేవుడిగదిలో గంటకు పైగా పూజలు చేస్తుంది. ఏడుకొండలవాడు తన పసుపు కుంకుమలను నిలబెడితే నిలువుదోపిడి... తన ఒంటిపై నున్న బంగారం సమస్తం హుండీలో సమర్పించుకుంటానని మొక్కుకుంది.

***

మహానగరంలో అది మురికివాడ. ఇరుకు ఇరుకు కొంపలు. ఇరుకుఇరుకు రోడ్లు. అక్కడ నివసిస్తున్న వారంతా పేద, దిగువ మధ్యతరగతి వాళ్ళు. తులసమ్మది ఆ ఇరుకువీధిలో కాస్త పెద్ద ఇల్లుకిందే లెక్క. ఎనభై గజాల స్థలంలో రెండంతస్తుల మేడ. చిన్నచిన్న పోర్షన్ల కింద అద్దెలకు ఇచ్చేసి, రెండో అంతస్తులో మాత్రం పూర్తిగా తులసమ్మ కుటుంబమే వుంటోంది.

ఆ పేటలో సందడి అంతా తులసమ్మదే. ఏ పిల్లల పుట్టినరోజు పండగల వనీ,ఏ చిన్నారి పుష్పవతి అవనీ, ఎవరెవరి పెళ్ళిళ్ళు, పేరంటాలు కానియ్ అందరి కన్నా ముందు ఉంటుంది తులసమ్మ.

పేటలో అందరికీ తులసమ్మ కావాలి. అలాగే తులసమ్మకి పేటలో జనమంతా కావాలి.

తులసమ్మ ఆ పేటకు నాయకురాలు కాదు. మున్సిపల్ కార్పొరేటర్ అంత కన్నా కాదు. ఊరందరితోనూ కలివిడిగా వుండే తత్వం అంతే.ఆమె నోరు మంచిది. చేయి మంచిది. చూపు చల్లనిది. నవ్వు నిర్మలమైనది. మనిషి కల్లాకపటం లేనిది.

ఆమె వయసు నలభై దాటింది. తెల్లగా వుంటుంది. ఇపుడు కాస్త లావు అయిందిగాని, జ్యోతి వయసులో తను అచ్చంగా జ్యోతిలానే సన్నగా అందంగా వుండేది. జ్యోతి చీరకడితే తనే అనుకొని పొరపడేవాడు మొగుడు. నవ్వుకునేది తులసమ్మ. తను విద్యావంతురాలు కాకపోయినా సంస్కారవంతురాలు. గుణవంతు రాలు.

భాగ్యవంతురాలు కాదుగాని, బాగానే సంపాదిస్తోంది అనాలి. ఆమె సంపాదన అంతా మొగుడు ఉద్యోగంతో మాత్రం కాదు. అతడి ఉద్యోగం రైల్వేలో ఫిట్టరు. అతడి తిరుగుళ్ళకి, తాగుడుకి, పేకాటకి, సిగరెట్లకి అతడి జీతం చాలదు.

పైగా పెళ్ళాన్ని డబ్బులు కోసం పీడిస్తాడు. తులసమ్మ సంపాదన ఇంటి అద్దెలు. ముఖ్యంగా చీటీలు నిర్వహిస్తుంది. దానికితోడు వడ్డీ వ్యాపారం.

వడ్డీ వ్యాపారస్తురాలై వుండీ... ఆమె వూరిజనం అభిమానం పొందడం విశేషం. అడిగినవాళ్ళందరికీ కాదనకుండా సాయం చేస్తుంది. జనాల రక్తం తాగేయకుండా రెండు రూపాయల వడ్డీ మాత్రమే తీసుకుంటుంది. తన వ్యాపారంలో నిజాయితీగా, నిక్కచ్చిగా, కటువుగా వుంటుంది. ఉదారస్వభావం ఎంత వుందో అంత గయ్యాళితనం కూడా వుంది.

తనీ స్థితిలో వున్నదంటే... అదంతా భగవంతుని దయగా భావిస్తుంది. ఈ మురికివాడలో, తనింటి వాతావరణంలో కూతురు మెడిసన్ చదువుతున్నదంటే, కొడుకు గిరిబాబు కోరుకొండ సైనిక్ స్కూల్లో చదువుతున్నాడంటే... అదంతా దేవుడు తనపట్ల అపారంగా కురిపిస్తున్న దయగా భావిస్తుంది. అలాగే తను ఏది చేసినా అది దైవాజ్ఞగా తలపోస్తుంది.

గిరిబాబు జగ్గారావు కొడుకే గాని, జ్యోతి జగ్గారావు కూతురు కాదు. అవును. తులసమ్మది మారుమనువు. జగ్గారావు ఆమె మొదటి భర్త కాదు. వయసు పదహారు సంవత్సరాలకే రాజయ్యను పెళ్ళాడింది.

పెళ్ళై ఏడాది తిరగకమునుపే జ్యోతిని కన్నది. జ్యోతి ఏడాది వయసు దాటక మునుపే రాజయ్య చచ్చిపోయేడు. తాగి, లారీకింద పడి చచ్చిపోయేడు. అతడు బతికినంతకాలమూ తులసమ్మని తిట్టి, కొట్టి, హింసించి చంపేడు.

చీటీలు, వడ్డీ వ్యాపారమూ అత్తగారింటి వారసత్వమే. అత్త తనపై ఎంత

పెత్తనం చేసినా, చూడటం బాగనే చూసుకునేది. తనకి మారుమనువు పుణ్యం కట్టుకున్నది అత్తగారే. ఆమె చెల్లెలు కొడుకు జగ్గారావుని తనకి కట్ట బెట్టింది. తర్వాత గిరిబాబు పుట్టిన ఏడాదికి అత్తగారు పరలోకం పయనించింది.

తులసమ్మకు సంసారంలో మారుమనువు మొగుడు వల్ల మోకాలి లోతు సుఖం. మెడలోతు దుఃఖం.

ఆమె మొగుడు అనగా తాగేవాడు, తిరిగేవాడు, తిట్టేవాడు, కొట్టేవాడు. అవన్నీ పురుష లక్షణాలుగా తలపోసింది. మొగుడు దుష్టుడైనా, కుష్టువాడైనా భరించి ఒక పరిపూర్ణతగల సహధర్మచారిణిగా, ఒక పరిచారికగా, పాదదాసీగా తరించాలని ఆమెకు అత్తగారి బోధలూ,హరిదాసు కథలూ, సినిమాల వల్ల బాగా అర్థమైంది.

పురాణకాలపు పతివ్రతల కథలు ఆమె రక్తంలో జీర్ణించుకుపోయేయి. ఛండాలపు మొగుళ్ళను నెత్తిన పెట్టుకుని ఊరేగిన, పూజించిన అలనాటి నారీమణు లంతా ఆమెకు పూజ్యులైనారు.

పురాతన పురుషులకు తనేం తీసిపోను అన్నట్లు జగ్గారావు ప్రవర్తించేవాడు. తులసమ్మను వేధించేవాడు. ఒకసారి గప్‌చిప్‌గా ఆమెకు సుఖవ్యాధి అంటించేసేడు. ఆమె చాలాకాలం అది సుఖవ్యాధిగా కనుక్కోలేకపోయింది. విపరీతంగా బాధపడి ఆస్పత్రిచుట్టూ తిరిగింది. తన బాధ ఇరుగుపొరుగుకి చెప్పుకోలేక సిగ్గుపడింది. జగ్గారావుకి ఏ సిగ్గూ లేదు.

అతడు తాగివచ్చి తరచుగా, అనవసరంగా తులసమ్మతో గొడవపడి పరమ బూతులు తిట్టడం అతని అలవాటు. అంతకుమించి బండబూతులు తులసమ్మా తిడుతుంది. అతను కొడతాడు. ఆమె కొట్టలేదు. పాపభీతి. అంచేత పట్టరాని కోపంతో 'నీవు రాలిపోను. నీకు పెద్దదినం సేసియ్యా' అని శపిస్తూ ఏడుస్తుంది.

చిత్రమేమిటంటే మరుసటి రోజు ఉదయం మొగుడూ పెళ్ళాలు ఇద్దరూ మామూలుగానే వుంటారు. గత రాత్రి వీళ్ళిద్దరూ గొడవపడ్డారంటే ఎవరూ నమ్మరు. మొగుడెంతటి దుర్మార్గుడైనా, పాపాత్ముడైనా... అసలు మొగుడంటూ ఒకడున్న ప్పుడే ఏ స్త్రీకయినా రక్షణ, విలువ, గుర్తింపు, గౌరవం అని తులసమ్మ బలంగా నమ్ముతుంది. భర్తని భగవత్స్వరూపుడిగా భావించి, మంగళసూత్రాలను పదేపదే కళ్ళకద్దుకుంటుంది.

రెండేళ్ళ కిందట జగ్గారావు రెండు కాళ్ళూ విరగ్గొట్టుకొని మంచం ఎక్కేశాడు. నెలరోజులు ఆస్పత్రిలోనూ, రెండు నెలలపాటు ఇంట్లోనూ మంచంపై నుంచి

కిందకు దిగలేదు. మలమూత్రాదులన్నీ మంచంపైనే. తులసమ్మ అప్పుడప్పుడు చిరాకుపడినా, అసహ్యించుకోకుండా మొగుడికి సేవలు చేసింది. తాగితే గాని నొప్పి తగ్గదని గోలపెడితే మందుసీసాలు కూడా అందించింది.

తన కాళ్ళు విరిగిపోవడానికి కారణం కారు యాక్సిడెంట్ అన్నాడు జగ్గారావు. కారు హఠాత్తుగా గుద్దేసి ఆగకుండా స్పీడుగా వెళ్ళిపోయిందన్నాడు. నమ్మేసింది తులసమ్మ. కాని తర్వాత తెల్సింది అది నిజంకాదని, ఒక అక్రమసంబంధం కారణంగా బాణాకర్రతో బాది, కాళ్ళు విరగ్గొట్టి ఆ రాత్రప్పుడు రోడ్డుపక్కన పడేశారని.

గుండెలు బాదుకుంది తులసమ్మ. "నీకేం పోయే కాలంరా! నీ ముండల సరదా మండిపోను. పేణాల మీదకి తెచ్చుకొని నన్ను ముండమోపిని సేసేయకురా సచ్చినోడా" అని తిట్టి అంతటితో వూరుకోకుండా మొగుణ్ణి దేవుడి గదిలోకి తీసుకెళ్ళి, తను పరాయి స్త్రీల జోలికి వెళ్ళకుండా దీపం ఆర్పించి, ప్రమాణం చేయించింది. తను మంగళసూత్రాల్ని కళ్ళకద్దుకొని మొగుణ్ణి నూరేళ్ళపాటు దక్కించమని దేవుణ్ణి వేడుకుంది. దైవభీతి లేదు జగ్గారావుకి. అతని ఆగడాలను దేవుని ప్రమాణాలు ఆపలేవు. వయసులో నున్న ఆడదాన్ని చూస్తే అమాంతంగా ద్విపాదపశువు అయిపోతాడు. ఆ మధ్య సిటీబస్‌లో ఒక ఘనకార్యం చేసేడు. గుండెలు గుబగుబలాడించే సంఘటన అది.

సిటీబస్‌లో ప్రయాణీకుల పర్సుల మీద, నగలమీద దొంగలు గప్‌చుప్‌గా దాడిచేస్తారు. జగ్గారావు మాత్రం సిటీబస్‌లో, రష్‌లో వేలాడుతున్న ఒక యువతి ఎత్తు గుండెలపై దాడి చేసేడు. ఆబగా, అమాంతంగా, అమానుషంగా ఆమె గుండెల్ని దోచేసుకున్నాడు. ఆమె దబ్బున కిందపడిపోయింది. అతడూ పడి పోయేడు. పడిపోయినా ఆమె గుండెల్ని వదలడు.

ఆమె షాక్ తినేసి, కెవ్వుమని అరచి, ఎంతగా ప్రతిఘటించినా వక్షంపై అతని ఉడుంపట్టు నుంచి తప్పించుకోలేకపోయింది.

నిర్ఘాంతపోయిన ప్రయాణీకుల్లో చాలామందికి అది విడ్డూరమూ, వినోదమూ అయింది. అలాంటి అకృత్యాలను ఒక తమాషాగా చూడగలగడం అమానవీయం, విషాదమూను. ఎన్ని కేకలువేసినా, లాగినా, కొట్టినా అతడు ఉడుం పట్టు వదలడే.

చివరికి బస్‌డ్రైవర్, మరికొందరు రంగంలోకి దిగి ఆ యువతిని రక్షించగలి గేరు. పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చి, లాఠీలతో కొట్టించి, బొక్కలో తోయించేయ డానికి ఆమె ముందుకు రాలేదు. ఆమె విధించిన శిక్ష ఏమిటంటే అతని ముఖంపై

ఉమ్మింది. చెప్పుతో కొట్టింది. సిగ్గుతో, దుఃఖంతో అర్థాంతరంగా బస్‌దిగి వెళ్ళిపోయింది.

జగ్గారావుని ఆమె వదిలేసినా బస్సులో ఆడవాళ్ళు వదల్లేదు. కసితీరా చెప్పులతో కొట్టేరు. ఒకరిద్దరు మగవాళ్ళు కూడా చేయి చేసుకున్నారు. తగిలిన దెబ్బలకు తాగింది దిగిపోయిందేమో తప్పా సిగ్గుపడలేదు. పశ్చాత్తాపం చెందలేదు. వక్షోజాల ఎవరెస్టు శిఖరం ఎక్కినంత థ్రిల్, తృప్తి ఆస్వాదించేడు జగ్గారావు.

***

ఆస్పత్రిలో జగ్గారావుని బతికించడానికి వైద్యులు విశ్వప్రయత్నం చేసేరు. కాని దేవుడు వైద్యుల ప్రయత్నాలను వమ్ము చేసాడులా ఉంది.

జగ్గారావు చచ్చిపోయేడు. భర్త మరణాన్ని తులసమ్మ తట్టుకోలేకపోయింది. దేవుడు తనకు తీవ్రంగా అన్యాయం చేసేడనీ భావించి, దేవుణ్ణి తెగ నిందించింది.

పెదకర్మనాడు జగ్గారావుకి ఇష్టమైన సమస్త వంటకాలు విస్తరిలో పెట్టేరు. కోడి, మేక, గొర్రె మాంసాలు, మద్యం సీసాలు అన్నీ పెట్టేరు – ఒక్క స్త్రీ అవయవాలు తప్ప! అందుకే గాబోలు ఒకంతట కాకి ఎంగిలి చేయలేదు. కర్మ తదనంతరం బంధువులు వెళ్ళిపోయేరు. కొడుకు గిరిబాబు కోరుకొండ వెళ్ళి పోయేడు.

జ్యోతి మాత్రం మెడికల్ కాలేజీకి సరిగా వెళ్ళలేకపోయింది – తల్లి ఇంకా కోలుకోకపోవడంతో.

ఇల్లు, వ్యాపారం ఏమీ పట్టించుకోకుండా ఏడుస్తూ కూర్చుంటోంది అమ్మ. సరిగా తిండి తినదు. నిద్రపోదు. ఎంత సముదాయించినా మనిషి కావడంలేదు. నెలరోజులు దాటినా అదేస్థితి.

దాంతో జ్యోతిలో అసహనం. జగ్గారావు బతికినంత కాలం తల్లిని ఏడ్పించేడు. చచ్చిపోయేక కూడా తల్లిని ఏడిపిస్తున్నాడు. అతనివల్ల అమ్మ సుఖపడింది ఏమీ లేదు. కాని సోషల్ స్టేటస్ కోల్పోయింది. ఊళ్ళో ఏ శుభకార్యాలకైనా, పండుగ పబ్బాలకైనా తనే ముందు వుండేది. ఇప్పుడది మిస్ అవుతోంది. ఇక ఎవరూ ఏ కార్యానికి బొట్టుపెట్టి పిలవరు. తను వెళ్ళకూడదు. ముత్తయిదువ స్థానం మరికలేదు అమ్మకు.

అయితే అందుకు బాధపడవలసిన అవసరం ఏమీ కనిపించలేదు జ్యోతికి. ఈ కాలపు ఆడపిల్లలకయితే ఇవేమీ సమస్యలు కానేకావు.

తల్లిని ఎంత పూర్వకాలపు మనిషిగా సమాధానపరుచుకున్నా... జ్యోతిలో సహనం సన్నగిల్లి చికాకు కలిగిస్తోంది. తల్లి ఏడుపు తనకు అర్థంకాని ఒక

పజిలైంది. తనిప్పుడు రోజూ తల్లివద్దే పడుకుంటోంది.

ఓరోజు రాత్రి ఏదో చప్పుడుకి నిద్రపోతున్న జ్యోతి తుళ్ళిపడి లేచింది. ఆ చప్పుడు ఇంకేమిటో కాదు, తల్లి ఏడుపు! "ఏమిటమ్మా ఇది. ఇలా ఎన్నాళ్ళు ఏడుస్తావ్" అంది చిరాగ్గా జ్యోతి.

"నా బాధ నీకేం తెల్సు"

"ఏమిటమ్మా నీ బాధా?" అడిగింది జ్యోతి.

"కొన్ని బాధలు కూతురితో చెప్పుకునేవి కావు"

తిక్కరేగింది జ్యోతికి. "సరే. నీ బాధలు నీవి. నీ మొగుణ్ణి నువ్వు దూరం చేసుకోకుండా వుంటే ఈ బాధలు, ఏడుపులు వుండేవి కాదు కదా"

"ఏటీ? ఏటన్నావ్. నా మొగున్ని నేను దూరం సేసుకున్నానా" అంది తులసమ్మ.

"అవును. అక్షరాలా నీకు నువ్వే దూరం చేసుకున్నావ్. ఏమీ తెలీనట్టు మాటాడుతావేమిటీ? నీ చేతులతో నీవే చేసుకున్నావ్" అంది జ్యోతి.

కూతురు మాటలు మంచుకత్తుల్లా గుండెల్లో దిగేయి. జ్యోతి చెంపని ఛెళ్ళుమనిపించింది తులసమ్మ. "ఏటే వాగుతున్నావ్ గుంటదానా. నాలిక చీరేస్తాను" అంటూ పూనకం వచ్చినదానిలా వూగిపోయింది తులసమ్మ.

***

అసలు ఏమి జరిగిందంటే...

ఆ రోజు రాత్రి కుండపోతగా వర్షం పడుతోంది.

జ్యోతి తన గదిలో చదువుకుంటోంది. రోజూ రాత్రి పన్నెండు గంటలవరకూ చదువుకోవడం ఆమెకు అలవాటు. తనకు వర్షం వల్ల ఇబ్బంది ఏమీలేదు గాని చీకటి అంటే చచ్చేటంత భయం.

అంచేత తన వద్ద ఛార్జ్ చేయబడిన ల్యాంప్ సిద్ధంగా ఉంచుకుంటుంది.

అవతల గదిలో తులసమ్మ నిద్రపోతోంది.

జగ్గారావు ఇంకా ఇంటికి రాలేదు.

అతడు ఏ టైమ్‌లో ఇంటికి వస్తాడో ఎవరికీ తెలీదు. అతనికి కూడా తెలీదు. అతని భోజనం డైనింగ్ టేబుల్‌పై మూతపెట్టబడి వుంది. "నాన్నా రాగానే నేను భోజనం పెడతానులే అమ్మా" అంది జ్యోతి.

తర్వాత జ్యోతి చదువుకుంటుండగా...తలుపు చప్పుడు. లేచివెళ్ళి తలుపులు

తీస్తే ఇంకెవరు? జగ్గారావు. వర్షానికి బాగా తడిసి ముద్దయిపోయేడు.

అతని నోరు గుప్‌మని సారాకంపు కొడుతోంది.

జ్యోతి లోపలికి వెళ్ళి తండ్రి తుడుచుకోవడానికి టవల్, కట్టుకోవడానికి లుంగీ పంచె తెచ్చింది. అతడు విప్పిన బట్టలు పిండి పక్కనే వున్న తాడుపై ఆరేసింది. అమ్మ నిద్రపోతున్న విషయం చెప్పి - "రా నాన్నా! భోజనం చేద్దువుగాని" అంది జ్యోతి.

హఠాత్తుగా జగ్గారావు జ్యోతిపై చేయి వేశాడు.

ఈ మధ్య తరచుగా, అనవసరంగా తనపై చేయి వేయడం, నిమరడం లాంటి చేష్టలు ఆమెకు చికాకు కలిగిస్తోంది. ఆ స్పర్శలో ఆత్మీయసంస్కారం వుంటే కదా! "నీవు నాకు ఇరవయ్యేళ్ళ తులసివే" కొండచిలువ స్పర్శ, వెకిలినవ్వు.

"అయ్యో! తాగుబోతు నాన్నా! నేను మీ కూతుర్ని, చంటిదాన్ని" అంది జ్యోతి.

అంతలో తనపై నల్లటి ముసుగేసినట్టు చీకటి. కటిక చీకటి. కరెంట్ పోయింది. ఆ సమయంలో కటిక చీకటికన్నా తన వంటిపై తండ్రి చేతుల పోకడ విపరీతంగా భయపెట్టింది. తను ఛార్జిబుల్ ల్యాంప్ వెలిగించడానికి అవకాశం అతడు ఇవ్వలేదు.

తనపై చేతులు తండ్రివి కావు. కామాంధుడివి అని ఆమె గ్రహించేలోపు ఆమెపై అత్యాచారయత్నం.

"తప్పు నాన్నా! నీ కూతుర్ని నాన్నా" అన్న మాటలు మదపుటేనుగుకి వినబడటం లేదు.

జ్యోతి తనని తాను రక్షించుకునే స్థితిలో లేక, అగ్ని పర్వతం గుండెలు పగిలేలా 'అమ్మా అమ్మా' అంటూ హృదయవిదారకంగా వేసిన పెనుకేకలకి... జ్యోతి అమ్మ... తులసమ్మ భద్రకాళీలా ప్రత్యక్షమైంది.

ఆమెతో బాటే దిగ్గుమని మిరుమిట్లు గొలుపే దివ్యకాంతి భయంకర నిశీధిని చీల్చిచెండాడింది. కరెంట్ వచ్చింది. కూతురిపై తండ్రి నికృష్ట దుర్మార్గ దుశ్చేష్టకు దిగ్భ్రాంతి చెంది, ఆగ్రహోదగ్రమూర్తి అయింది తులసమ్మ. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కత్తిని సానబెడుతున్న చప్పుడులా ధ్వనిస్తున్నాయి.

పాశవిక పరిష్వంగంలో నలిగి నుజ్జయిపోతున్న నునులేత మొగ్గని, తన బిడ్డని చూసి చలించి, భీకర కోపాగ్నుల మధ్య ఒక మహోధృతమైన తరంగంలా, మదుపుటేనుగు కుంభస్థలం బద్దలుకొట్టే ఉగ్రసివంగిలా జగ్గారావుపై దుమికింది.

కలియబడింది.

ఆమె ధాటికి అతడు నిలువలేక గదిలోంచి, దబ్బున వరండాలోకి, వర్షంలోకి బంతిలా ఎగిరిపడిపోయేడు. పడిపోయనవాడు తడుస్తూ పిట్టగోడనానుకొని లేచినించున్నాడు. అతడు భార్యను చూసి భయపడి చేతులెత్తేయలేదు. అతడిలో పశ్చాత్తపం, పాపభీతి లేవు. బూతులు తిడుతూ ముందుకి ఉరుకుతున్నాడు.

తులసమ్మ వెనకడుగు వేయలేదు. అతడి ముందు కొచ్చింది. వర్షంలో తడుస్తోంది. ఒక సైక్లాజికల్ షాక్, ఒక అభద్రభావం, గుండెల్ని పిండేస్తున్న భయం తులసమ్మని నిలవనీయలేదు. తన బిడ్డకి ఈ క్షణమే కాదు, అనుక్షణం ప్రమాదం.

కూతురిపై వీడి లైంగిక నైచ్యం ఇరుగు పొరుగుకి చెప్పుకోలేదు. రక్షణకోసం పోలీస్ రిపోర్టు ఇవ్వలేదు. తన పరువుని బజారులోకి ఈడ్చుకోలేదు.

తన పొదుగును గుద్దిగుద్ది పాలు తాగితాగి, ఇంతలా ఏపుగా పెరిగిన తన ప్రియమైన, ప్రాణమైన అల్లారుముద్దు దూడను ఈ పొగరుబోతు ఆంబోతు నుంచి రక్షించుకోవడమే తక్షణ కర్తవ్యం.

ఉగ్రమూర్తి గోమాత తన కాళ్ళను బలంగా నేలకు అదిమిపెట్టి కొమ్ములతో ఆంబోతుని ఎత్తి కుదేసినట్టు... తులసమ్మ తనువులో బలోపేతమైన అద్భుతశక్తులేవో ఉద్భవించి, రేగి రగిలి ప్రచండ ప్రభంజనమై జగ్గారావుని అమాంతంగా ఎత్తి బొమ్మలా విసిరేసింది. చీదేసిన జువ్వలా, కూలిన తాడిచెట్టులా పిట్టగోడపై నుంచి కింద సిమెంట్ రోడ్డుపైన పడిపోయేడు.

జగ్గారావు తలపగిలి ఒక పెద్ద పిడుగుపడ్డట్టు చప్పుడుడవటంతో చుట్టుపక్కల జనం అదిరిపోయి ఇళ్ళల్లోంచి బయటకు వచ్చేరు. అవాక్కయి జగ్గారావు చుట్టూ చేరేరు. గుండెలు బాదుకుంటూ, ఏడుస్తూ తులసమ్మ ప్రత్యక్షమయింది. ఆ దుర్భర దృశ్యానికి వర్షమే కాదు సాక్షి... జ్యోతి కూడా!

***

జ్యోతి డైరీ తీసి రాయడం ప్రారంభించింది.

జగ్గారావు దుర్మరణం నిజం. అమ్మ దుఃఖం నిజం.

అమ్మ హత్యచేయడం కూడా నిజం. కాని ఆ మాట అంటే చంపేస్తా నంటోంది అమ్మ. జరిగిందంతా ఒప్పుకుంటోంది గాని మొగుణ్ణి మేడమీదనించి కిందకి తోసేయలేదంటోంది. నేను కన్నకూతుర్ని, పోలీసుని కాదు. న్యాయం, ధర్మం అంటూ అమ్మను పోలీసుల ముందు లొంగిపొమ్మనడం లేదు.

తల్లీబిడ్డల మధ్య దాపరికాలు ఏల? కేవలం నా ఆత్మతృప్తికి జరిగింది జరిగినట్టు ఒప్పుకోమన్నాను.

"అయ్యో! నా మొగుణ్ణి నేను చంపుకోవడమేటే తల్లీ" అని నెత్తీ నోరు కొట్టుకుని ఏడ్చింది. నాపై కోప్పడింది. దేవుడిమీద ప్రమాణం చేసింది. ఏమంటాను?

ఇక అమ్మపై ఒత్తిడి చేయడం మానుకున్నాను.

నా ఆలోచనలు మరో కోణంలో సాగేయి.

పురాణస్త్రీల వరసలో నిలబడేటంత పతివ్రత అమ్మ. ఎంతటి పరమనీచుడైనా పతిగాడే ప్రత్యక్షదైవమని భావించే అమ్మ, అనివార్యస్థితిలో తన ప్రత్యక్ష దైవాన్ని హతమార్చింది. అది ఆపద్ధర్మం.

ఆవేశం చల్లారి అమ్మవారి అవతారం నుంచి అమ్మగా సహజస్థితికి వచ్చేసేక అమాయకంగా తనకు ఏదీ తెలియదంటోంది. తనకు తెలియకుండానే సాగిన దుష్టసంహారం. ఇదొక సింద్రోమ్ అని నా భావన.

బ్రిటేడ్ ఉమన్ సింద్రోమ్ లక్షణాలు గల స్త్రీ దుర్మార్గుడైన భర్తను, ఏదొక సమయంలో ఒక ఉద్వేగంతో, కసితో చంపేస్తుంది. ఆ సమయంలో ఏ ఆయుధం ఉపయోగించి, ఏ విధంగా చంపింది అనేది ఆమెకు తెలీదు. షి డజ్ నాట్ నో వాట్ షి ఈజ్ డూయింగ్. తర్వాత అది హత్యగా రికార్డు అవుతుంది గనుక, పోలీస్ ఇంటరాగేషన్‌లో ఆమె హంతకురాలుగా బయటపడుతుంది.

అమ్మ విషయంలో అదృష్టం ఏమిటంటే జగ్గారావు మరణం యాక్సిడెంట్‌కి అవకాశం వున్న మరణం. పైగా అతనికి తాగుబోతు, తిరుగుబోతు రికార్డు వుండటం వల్ల దర్యాప్తు మరో కోణంలో సాగకుండా అమ్మ రక్షింపబడింది. నేను మళ్ళీ మొదటికొస్తున్నాను.

నా మనసులో ఊగిసలాటకి చెక్ పెట్టలేకపోతున్నాను. ఆ సింద్రోమ్ లక్షణాలు అమ్మకు ఖచ్చితంగా వర్తిస్తాయా? లేక అంతా తెలిసే ఏమీ తెలియనట్టు నాటకం ఆడుతోందా? ఏది ఏమైనా దీనిపై నేనొక గట్టి నిర్ణయం తీసుకున్నాను. జగ్గారావు హత్యోదంతంపై అమ్మతో వాదన పెట్టుకోదల్చలేదు. అసలా విషయం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రస్తావించదల్చుకోలేదు.

పాకులాడటం వల్ల ప్రమాదమే తప్ప ప్రయోజనం లేదుగాక లేదు. అమ్మను గెలికి, వేధించడం నిజంగా నాది బుద్ధితక్కువతనమే.

అంచేత అమ్మను, నా కోసం తన ప్రత్యక్ష దైవాన్నే త్యాగం చేసిన అమ్మను

ప్రసన్నం చేసుకోవడం నా బాధ్యతగా భావించి... నేనూ నాటకం ఆడేను. తప్పు నాపై వేసుకున్నాను.

"అమ్మా! నన్ను క్షమించమ్మా!నేను ఏదేదో పిచ్చిపిచ్చిగా వాగి నీ హృదయాన్ని గాయపరిచాను. బాధించాను. నీలాంటి పతివ్రతలు భర్తను నెత్తిన పెట్టుకొని ఊరేగుతారు తప్పా, కిందకు విసిరేయరని ఒప్పుకుంటున్నానమ్మా" అని అమ్మ కాళ్ళుపట్టుకున్నాను.

ఏమైతేనేం, ఎట్టకేలకు అమ్మ నన్ను క్షమించింది. అంతేకాదు. ఏడుపు రాగానికి ఫుల్‌స్టాప్ పెట్టేసి మామూలు పరిస్థితులకు అలవడుతోంది. సంతోషం... అని డైరీలో రాసుకుంది జ్యోతి.

అంతలోనే ఆమెలో భయం అంకురించి గుబగుబలాడించింది. ఈ డైరీలో పేజీలు పొరపాటున ఎవరైనా, ఎప్పుడైనా చదివితే అమ్మ పరిస్థితి ఏమిటీ? వెంటనే డైరీలో రాసిన కాగితాలను చించేసి, చిన్నచిన్న ముక్కలుగా చేసి... జగ్గారావుని విసిరేసిన ఆ పిట్ట గోడమీద నుంచే... కిందకు విసిరేసింది జ్యోతి.

*(స్వాతి మంత్లీ - నవంబర్ 2011)*